క్లుప్తంగా

మరిడమ్మకు దవులూరి పూజలు



మరిడమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దొరబాబు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ ఆలయంలో మంగళవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ప్రత్యేక పూజలు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటై రాష్ట్రానికి సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి కావాలంటూ అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బొద్దు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజు

సామర్లకోట: పదో తరగతి పరీక్షలు రాయడంలో లక్ష్యం నిర్ణయించుకోవాలని పిఠాపురం చైల్డ్ స్పెషలిస్టు డాక్టరు పీఎస్ రాజు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక బ్రౌన్‌పేటలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు రాసే విధానంపై అవగాహన కల్పించారు. పాఠ్యాంశాలు ఎలా చదవాలి, ఎంత సమయం చదవాలి లక్ష్యాలు ఎలా నిర్ణయించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో ఆరోగ్య పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన సూచించారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ ప్రిన్సిపాల్ యు.మీనా మాధురి అధ్యక్షత వహించగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయవాడకు తరలివెళ్లిన హమాలీలు

సామర్లకోట: చలో విజయవాడ కార్యక్రమానికి సామర్లకోట నుంచి ఐఎంఎఫ్ఎల్ డిపోల్లో పని చేస్తున్న హమాలీలు తరలివెళ్లారు. మంగళవారం సామర్లకోట, అమలాపురం డిపోలకు చెందిన హమాలీలు రైలులో విజయవాడకు వెళ్లారు. ఎగుమతి, దిగుమతి కూలీ రేట్లు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలనే డిమాండ్ల సాధన కోసం ఏపీ బేవరేజ్ కార్పొరేషన్‌కు వెళ్తున్నట్లు హమాలీస్ సంఘ నాయకులు తెలిపారు. సంఘ నాయకులు బి.ఆదినారాయణ, వి.గోవిందు, యు.సతీష్, కె.దుర్గాప్రసాద్, ఎం.వీరబాబు, బి.రామారావు పాల్గొన్నారు.

గోరుముద్దను సద్వినియోగం చేసుకోవాలి



సామర్లకోటలో ఆహారాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందజేస్తున్నామని, దీనిని ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. మంగళవారం స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో అమలు జరుగుతున్న గోరుముద్ద పథకాన్ని ఆయన పరిశీలించి రుచి చూశారు. పాఠశాలలో 95 శాతం మంది విద్యార్థులు భోజనాలు చేస్తున్నట్లు హెచ్ఎం యు.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెనడీ, టీఎస్ పద్మావతి, ఎస్.శ్రీదేవి, బీవీ తేజోలత తదితరులు పాల్గొన్నారు.

వివాహితను రక్షించిన రైల్వే పోలీసులు



భార్యాభర్తలకు కౌన్సెలింగ్ చేసిన రైల్వే పోలీసులు

సామర్లకోట: ఆత్మహత్యాయత్నం చేసిన ఒక వివాహితను మంగళవారం రైల్వే పోలీసులు రక్షించారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం వీకే రాయపురం గ్రామానికి చెందిన మలిరెడ్డి నాగమహాలక్ష్మి భర్త శివదుర్గ చెప్పినా వినకుండా అప్పులు చేయడంతో జీవితంపై విరక్తి చెందిన సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఆత్మహత్య చేసుకోవడానికి చిన్న కుమార్తెను తీసుకువచ్చినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే స్టేషన్‌లో పల్స్‌పోలియో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తమై రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఘటన ప్రదేశానికి చేరుకుని నాగమహాలక్ష్మిని రక్షించారు. విషయం తెలుసుకుని భర్త శివదుర్గకు సమాచారం ఇచ్చి ఇరువురికి ఎస్సై బి.లోవరాజు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేశారు.

శంకరా.. శుభంకరా..



పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామివారి నిజరూపం



పంచారామ క్షేత్రంలో స్వామివారు

- నేటి నుంచి శివరాత్రి మహోత్సవాలు
- పిఠాపురం, సామర్లకోటలలో ముస్తాబైన ఆలయాలు
- నేడు స్వామివార్ల దివ్య కల్యాణోత్సవం

పిఠాపురం/సామర్లకోట: హరోం హరా.. శుభంకరా.. అంటూ శైవ క్షేత్రాలు మార్మోగనున్నాయి. పిఠాపురంలోని పాదగయ, సామర్లకోటలోని పంచారామ క్షేత్రాల్లో బుధవారం నుంచి శివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరుగనుంది. పిఠాపురం పాదగయ క్షేత్రానికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. మహా శివరాత్రి పర్వదినాల్లో ఈ క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని వారం రోజుల పాటు నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్షపత్రి పూజలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఈ నెల 6వ తేదీ బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నమస్కార రీతులలో పాద నమస్కారం శ్రేష్ఠమైనట్లు త్రిగయా క్షేత్రాల్లో పాదగయ క్షేత్రం శ్రేష్ఠమైందని చెబుతుంటారు. అందుకే గోదావరి పుష్కర కాలంలో ఎక్కువగా ఒడిశా రాష్ట్రం నుంచి ఓఢ్రులు కనీసం ఇంటికి ఒకరైనా వచ్చి రాజమహేంద్రవరం గోదావరిలో స్నానం చేసి ఈ పాదగయ క్షేత్రంలో పిండ ప్రదానం చేయడం తరతరాలుగా వస్తోంది. ఇది పితృ దేవతలకు ముక్తి కలిగించే క్షేత్రంగా పేరొందింది.

దర్శనీయ ఆలయాలివే..

పాదగయ క్షేత్రం పలు ఆలయాల సమూహం. ఇక్కడ అనేక దేవతామూర్తుల ఆలయాలు దర్శనమిస్తాయి. తొలి పూజ అందుకునే గణపతి, విశేష అభిషేకాలు అందుకునే కాశీ విశ్వేశ్వరుడు, కాశీ అన్నపూర్ణాదేవి, చండీశ్వరస్వామి, గయాసురిని పాదాలు, నాగేంద్రస్వామి, దత్తాత్రేయ స్వామి, సాయిబాబా, కనకదుర్గాదేవి, నవగ్రహ దేవతలు,



పిఠాపురం పాదగయ క్షేత్రంలో పుష్కరిణి

సరస్వతీదేవి, ఆదిశంకరాచార్యుడు, అయ్యప్ప స్వామి తదితర ఆలయాలు ఇక్కడ ఉన్నాయి. కుక్కుటేశ్వరుని గర్భాలయం చుట్టూ ఈ ఆలయాన్ని నిర్మించారు. స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే సమయంలో వీరందరిని దర్శించుకునే అవకాశం ఉంది.

పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామివారి దివ్య కల్యాణం బుధవారం రాత్రి 8.32 గంటలకు నిర్వహించనుండగా, ఏడో తేదీ గురువారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేస్తారు. 8న మహాశివరాత్రి ఉత్సవం, 9న మధ్యాహ్నం మూడు గంటలకు నాకబలి, దండాడింపు, దొంగలదోపు ఉత్సవాలు, స్వామివారి రథోత్సవం, 10న స్వామివారి త్రిశూల స్నానం నిర్వహించనున్నారు. 11న స్వామివారి తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం ఉంటుంది. అలాగే పిఠాపురం సకలేశ్వర స్వామి, సోమేశ్వరస్వామి ఆలయాలు, గొల్లప్రోలు మండలం దుర్గాడలోని ఉమారామలింగేశ్వరస్వామి, గొల్లప్రోలులో ఉమారామలింగేశ్వర స్వామి, చేబ్రోలులో పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి, తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వర స్వామివారి ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.



సామర్లకోట ఆలయంలో విద్యుత్తు దీపాలంకరణ

నేడు భీమేశ్వరస్వామి కల్యాణం

సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి 9.25 గంటలకు నిర్వహించనున్నారు. మహా శివరాత్రికి రెండు రోజుల ముందుగా వచ్చే ఫాల్గుణ మాస ఏకాదశి పర్వదినంలో స్వామివారి కల్యాణం జరుగుతుంది. ఈ కల్యాణాన్ని పురస్కరించుకుని ఉదయం విఘ్నేశ్వర పూజ, దీక్షాధారణ ఉంటుంది. మధ్యాహ్నం స్వామివారి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పూలు, విద్యుత్తు దీపాలతో అలంకరించిన ఇత్తడి నంది వాహనంపై ఉంచి ఆలయం నుంచి పట్టణ పురవీధుల మీదుగా ఊరేగిస్తారు. అనంతరం ఆలయానికి వచ్చిన ఉత్సవమూర్తులకు ధ్వజారోహణ చేస్తారు. వేద మంత్రాలతో పల్లకిపై స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్దకు తీసుకు వస్తారు. అక్కడ అన్నవరం వేదపండితులతో పాటు ఆలయ పండితులు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని నృత్యాంజలి కళానిలయం బాల బాలికలచే కూచిపూడి నాట్యం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శర్మ, సుబ్రహ్మణ్యం తెలిపారు. గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు కల్యాణం ఉంటుందన్నారు. గురువారం స్వామివారికి లలితా పారాయణ, ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం మహా శివరాత్రి, మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పంచామృత అభిషేకాలు జరుగుతాయన్నారు. 10న రథోత్సవం, తీర్థం, కోలాటం, 11న శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

విజయం సాధించేందుకు 'సిద్ధం'

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే పట్టం
- ఎంపీ వంగా గీత



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ ఎంపీ వంగా గీత

పిఠాపురం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించేందుకు అంతా సిద్ధంగా ఉన్నామని కాకినాడ ఎంపీ, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. మంగళవారం గొల్లప్రోలులో పిఠాపురం నియోజకవర్గ మేము సిద్ధం మా బూత్ సిద్ధం పేరిట బూత్ కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులంతా ఆయా ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, ఆయా ప్రాంతాల అభివృద్ధిని తాను చూసుకుంటానన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపట్టడం ఖాయమన్నారు. అన్ని పార్టీల కంటే అతి శక్తివంతమైన క్యాడర్ ఉన్న పార్టీ వైఎస్సార్ సీపీ అని అన్నారు. బూత్ కమిటీల సభ్యులంతా తమ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను చైతన్యవంతులను చేసి ఓటు వేసే విధంగా పని చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందుకోని గడపంటూ ఏదీ లేదని, ఇప్పటికే ప్రజలంతా మళ్లీ వైఎస్ జగనన్ననే ముఖ్యమంత్రిగా చేయాలనే పట్టుదలతో ఉన్నారన్నారు. అయితే పోలింగ్ బూత్ వరకూ ఓటరు వెళ్లి ఓటు వేసే విధంగా బూత్ కమిటీలు ఓటర్లను చైతన్య పర్చాలన్నారు.

భారీ మెజార్టీ ఖాయం

కాకినాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ ఎన్నికల సమరం తుది దశకు చేరుకుంటుందని, ప్రతి బూత్ కన్వీనర్ తమ పరిధిలో అత్యధిక ఓట్లు వైఎస్సార్ సీపీకి పడే విధంగా పని చేయాలన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులంతా భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. అందరికీ సుపరిచితురాలైన ఎంపీ, నియోజకవర్గ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి వంగా గీతను భారీ మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇక్కడ గీతను గెలిపించడంతో పాటు 175 స్థానాలు గెలిపించి ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌ను చేద్దామని పిలుపునిచ్చారు. జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, నియోజకవర్గ అబ్జర్వర్ గౌతు సుబ్రహ్మణ్యం, స్వచ్ఛ సర్వేక్షణ్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల సాయి, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు, మండల, పట్టణ పార్టీల అధ్యక్షులు ఆనాల సుదర్శన్, బొజ్జా దొరబాబు, అరిగెల రామ్యదొర, మైనం రాజా, నాయకులు మొగలి బాబ్జీ, గండేపల్లి బాబీ, జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు పాల్గొన్నారు.

మాట తప్పని నేత సీఎం జగన్

- ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- నాగులపల్లిలో గడప గడపకూ..



నాగులపల్లిలో ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ గీత

కొత్తపల్లి: ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి, మాట తప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తి గడించారని ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. మహిళలు బాగుంటేనే సమాజం అభివృద్ధి పథాన పయనిస్తుందని నమ్మి అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. మంగళవారం నాగులపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డిలు ఎంపీని ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లుగా ప్రభుత్వ పథకాల ద్వారా అందించిన లబ్ధిని ఆమె బుక్‌లెట్ ద్వారా ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ గ్రామాల్లో ఒక్కొక్క సచివాలయ భవన నిర్మాణానికి రూ.20 లక్షలను కేటాయించారన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ పథకాలు దరిచేరాయన్నారు. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వంపై ఎల్లో మీడియా బురద చల్లుతుందన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పేదల సొంతింటి కల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సాకారమైందన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని నిరూపించుకుందన్నారు. వైస్ ఎంపీపీ మదిరెడ్డి దొరబాబు, ఉప సర్పంచ్ గుర్రాల చిరంజీవి కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, ఎంపీటీసీ సభ్యులు చింతపల్లి లక్ష్మి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, స్వచ్ఛాంధ్ర రాష్ట్ర డైరెక్టర్ బి.సాయి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచడమే స్వీప్ లక్ష్యం

ఎంపీడీఓ ఉషారాణి



గ్రామంలో ఓటరు అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దాపురం: రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 83 శాతం పైగా పోలింగ్ నమోదు లక్ష్యంగా ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం (స్వీప్) సదస్సులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ మాదిరెడ్డి ఉషారాణి అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో మంగళవారం ఆమె ఓటరు అవగాహన కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా సగటున 79.77 శాతం పోలింగ్ నమోదు కాగా జాతీయ స్థాయిలో 69 శాతం పోలింగ్ నమోదైందన్నారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో 83 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ఎన్నికల సంఘం అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల పోలింగ్‌లో భాగస్వాములై పోలింగ్ శాతాన్ని పెంచాలని వారు కోరారు. అనంతరం ఓటు హక్కు వినియోగం, ఎన్నికల పోలింగ్ సరళి తదితర అంశాలపై అవగాహన కల్పించి, గ్రామానికి చెందిన ఇరువురు సీనియర్ సిటిజన్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు చౌదరి, శర్మ, పంచాయతీ కార్యదర్శి నక్కా సూర్యనారాయణ మూర్తి, లక్ష్మి రాధాకృష్ణ, ప్రవల్లిక, వీఆర్ఓలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నేడు తెరుచుకోనున్న రైల్వే గేటు



సామర్లకోట రైల్వే గేటులో ట్రాక్ మరమ్మతులు చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులోని ఎల్‌సీ 426 రైల్వే గేటు బుధవారం సాయంత్రం తెరుచుకోనుంది. గత నెల 28 నుంచి రైల్వే గేటులో ట్రాక్ మరమ్మతుల వల్ల గేటును మూసి వేశారు. మహాశివరాత్రి సందర్భంగా గోదావరి కాలువ ఆవలి వైపు ఉన్న పంచారామ క్షేత్రాన్ని వేలాది మంది దర్శించుకునే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పనులు పూర్తి చేసి బుధవారం గేటును తెరుస్తామని రైల్వే మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. మంగళవారం రైల్వే ట్రాక్ మరమ్మతులు చురుగ్గా నిర్వహించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



కవాతు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి పిలుపునిచ్చారు. ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం స్థానికంగా సీఆర్‌పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ముఖ్య కూడళ్లలో డీఎస్పీ స్వేచ్ఛాయుతమైన ఓటు హక్కు వినియోగం, శాంతి భద్రతలను కాపాడడం అనే అంశాలను వివరించారు. ఈ మేరకు ఎన్నికల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజల సహకారం కావాలన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల్లో బందోబస్తుపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పోలీసులతో ర్యాలీ చేస్తున్నామన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం నుంచి బ్రౌన్‌పేట, పాత తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, మఠం సెంటర్, మెహర్ కాంప్లెక్స్ మీదుగా విస్తరణ శిక్షణ కేంద్రం వరకూ కవాతు నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్, సీఐ డి.సురేష్, ఎస్సైలు మూర్తి, మౌనిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సాయంత్రం వేట్లపాలెంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో కవాతు నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యం



జక్కి వేణుగోపాల్ (ఫైల్)

సామర్లకోట: మండల పరిధిలో చంద్రంపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మందులు తెచ్చుకొవడానికి వెళ్లి అదృశ్యమైన ఘటనపై పోలీసు స్టేషన్‌లో నమోదు అయింది. పోలీసుల కథనం ప్రకారం చంద్రంపాలెం గ్రామానికి చెందిన జక్కి వేణుగోపాల్ (46) సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి ఆటోలో మందులు తెచ్చుకొవడానికి వెళ్లి ఇంటికి రాలేదు. దాంతో బంధువులు గాలించగా ఆటో గొంచాల శివారున స్కూల్ వద్ద ఉన్నట్లు గమనించారు. అయితే వేణుగోపాల్ కనిపించలేదు. దాంతో మంగళవారం పోలీసు స్టేషన్‌లో తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెస్ విధిగా వసూలు చేయాలి

కాకినాడ సిటీ: నిర్మాణ పనులు అమలు చేసే శాఖలు, ప్లాన్ అప్రూవల్ చేసే శాఖలు విధిగా 1 శాతం లేబర్ సెస్ వసూలు చేసి ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ప్రతి నెలా ఆయా శాఖల్లో అమలు చేసే సెస్, పనుల వివరాలను కార్మిక శాఖకు అందజేయాలన్నారు. ఉపకార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికశాఖను అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని సంబంధిత సమాచారాన్ని డేటాబేస్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

కాకినాడ సిటీ: ఏపీఎస్ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ తరగతులు 16వ బ్యాచ్ మంగళవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఎంవీఐ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సొంతిల్లు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి
- లబ్ధిదారులకు రిజిస్టర్డ్ పత్రాల పంపిణీ



తాటిపర్తిలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేస్తున్న దొరబాబు

పెద్దాపురం: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సొంత ఆస్తి కల్పించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణంలో అందరికీ ఇళ్లు పథకంలో మంజూరైన ఇంటి పట్టాలను మంగళవారం రిజిస్టర్ చేయించి మున్సిపల్ చైర్‌పర్సన్ బొద్దు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్‌లతో కలిసి పంపిణీ చేశారు. మాట తప్పని మడమ తిప్పని నేతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని, అదే సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన వచ్చేలా లబ్ధిదారులందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని దొరబాబు కోరారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆకుల కృష్ణ బాపూజీ, ఆరెళ్లి వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు అందజేత



నాగరత్నానికి పింఛను అందజేస్తున్న కౌన్సిలర్ వీరభద్రరావు, అడ్మిన్ జోగారావు

సామర్లకోట: స్థానిక 8వ సచివాలయం పరిధిలోని 14వ వార్డు సంగీతరావుపేటకు చెందిన ఇమ్మంది నాగరత్నం అనారోగ్యంతో బాధపడుతూ రాజానగరంలోని జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పింఛన్ల పంపిణీ గడువు ముగియడంతో సచివాలయ అడ్మిన్ జోగారావు, వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు జీఎస్ఎల్ ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేశారు. కౌన్సిలర్ వీరభద్రరావు సూచన మేరకు రాజానగరం వెళ్లి పింఛను అందజేశామని జోగారావు తెలిపారు.



కాకినాడలో పింఛన్ అందజేస్తున్న తాతయ్యలు

కాకినాడకు వెళ్లి..

పెద్దాపురం: మండలం చంద్రమాంపల్లి గ్రామానికి చెందిన వలంటీర్ సాంబారపు తాతయ్యలు తమ పరిధిలో అనారోగ్యంతో కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధాప్య పింఛను లబ్ధిదారు కురిమెళ్ల వెంకటరమణమ్మకు కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రిలో మంగళవారం సర్పంచ్ కురిమెళ్ల లోవరాజుతో కలిసి పింఛన్ అందజేశారు. వలంటీర్ తాతయ్యలును లబ్ధిదారు అభినందించారు.

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌ల పంపిణీ

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వర ఆలయంలో మంగళవారం పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు స్వామి వారి దగ్గర పూజ చేసిన ప్యాడ్‌లు, పెన్నులు అందించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాలు మేరకు నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేసినట్లు ఆలయ ఈవో శివబాబు తెలిపారు. దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, డాక్టర్ చంద్రరెడ్డి, వీర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.